కూటమి నేతల మోసపుటడుగులు

- ప్రజలను మోసం చేసి సుపరిపాలనా?
- చంద్రబాబు రాజకీయ జీవితం అబద్ధాల మయం
- ఎర్రమట్టిని దోచుకుంటున్న తెలుగు తమ్ముళ్లు
- శ్రీశైలం, మహానందిలో దర్శనాల పేరుతో దోపిడీ
- బాబు ష్యూరిటీ...మోసం గ్యారెంటీలో మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి


గాజులపల్లెలో రైతులతో మాట్లాడుతున్న శిల్పా చక్రపాణిరెడ్డి, హాజరైన ప్రజలు

మహానంది: సుపరిపాలన అంటూ తొలి అడుగు పేరుతో కూటమి నేతలు ఊరూరా మోసపుటడుగుల కార్యక్రమం చేస్తున్నారని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి విమర్శించారు. సోమవారం ఉదయం తమ్మడపల్లె, సాయంత్రం గాజులపల్లె గ్రామంలో 'బాబు ష్యూరిటీ...మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. తమ్మడపల్లెలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొమ్మా మహేశ్వరరెడ్డి, గాజులపల్లెలో సీనియర్ నాయకులు కొండా మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ .. ఏడాది లోపే ప్రజల నుంచి బాబు వ్యతిరేకత మూటగట్టుకున్నారన్నారు. తొలి అడుగు పేరుతో కూటమి నేతలు పది ఇళ్లు తిరిగే లోపు ప్రజలు ప్రశ్నించే సరికి ఫొటోలు తీసుకుని పారిపోతున్నారని ఎద్దేవా చేశారు. మోసాల బాబుకు గుణపాఠం చెప్పేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. ఈ సందర్భంగా కొందరు తమకు తల్లికి వందనం రావడం లేదని, ఎనిమిది నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని గ్రీన్ అంబాసిడర్లు, అంకిరెడ్డి చెరువులో రెండు స్తంభాల ఎత్తు లోతుతో ఎర్ర మట్టి తవ్వేస్తూ కోట్లు సంపాదిస్తున్నారని శిల్పా దృష్టికి తెచ్చారు. కార్యక్రమాల్లో నియోజకవర్గ సీనియర్ నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, సీనియర్ ముఖ్య నాయకుడు కొండా మధుసూధన్‌రెడ్డి, తమ్మడపల్లె, గాజులపల్లె సర్పంచులు కొమ్మా ప్రతాప్‌రెడ్డి, బీసీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోగోలు శివశంకర్ నాయుడు, జాయింట్ సెక్రటరీ పుల్లయ్య, గడ్డం చంటి, బీసీ సంఘం నాయకులు గజ్జ పెద్దపక్కీరయ్య, నారాయణ, నరసింహ, మాజీ ఎంపీటీసీ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

టన్నుకు రూ. 200...
టిప్పర్‌కు రూ. 8 వేలు..

గాజులపల్లె సమీపంలోని అంకిరెడ్డిచెరువు నుంచి ఎర్రమట్టిని కూటమి నేతలు కొల్లగొడుతున్నారని, రైల్వే పనుల పేరు చెప్పి దోచుకుంటున్నారని శిల్పా చక్రపాణిరెడ్డి మండిపడ్డారు. ప్రతి టన్నుకు రూ. 200, టిప్పర్‌కు రూ. 8వేలు ఎమ్మెల్యే బుడ్డాకు చెల్లిస్తున్నారని విమర్శించారు. 'మన చెరువు...మన మట్టిని' మనమే కాపాడుకోవాలని, ప్రజలు ముందుకు వస్తే తాను ఎప్పుడూ సిద్ధంగా ఉంటానన్నారు. ఆత్మకూరులో ఒక బోలె ఇసుక రూ. 30 చొప్పున అమ్ముకుంటున్నారని ఆరోపించారు. గ్రామాల్లో మద్యం ఏరులై పారుతుందని, క్వార్టర్‌కు రూ. 50 అధికంగా ఇస్తే పొలాలు, సిట్టింగ్ ప్రాంతాలకే తెచ్చిస్తున్నారంటే మద్యం దందా ఎలా సాగుతుందో అర్థం చేసుకోవచ్చన్నారు. 'మా ప్రభుత్వం ఉంది, గ్రామాల్లో ఏం చేసినా చెల్లుతుందని' టీడీపీ నేతలు బరి తెగిస్తూ హత్యలకు పాల్పడుతున్నారన్నారు. మద్యం మత్తులో శ్రీశైలం నియోజకవర్గంలో సీతారామాపురం, లింగాపురం, గాజులపల్లె ఆర్ఎస్, మసీదుపురం గ్రామాల్లో నాలుగు హత్యలు జరిగాయన్నారు.

అన్న మనుషులమంటూ మల్లన్నకు శఠగోపం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో శ్రీశైలం, మహానంది ఆలయాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దర్శనం జరిగేదని, ప్రస్తుతం టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 'అన్న మనుషులమంటూ'.. అభిషేకాల పేరుతో దోచుకుంటున్నారని శిల్పా చక్రపాణిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీశైలంలో దర్శనాల పేరుతో వసూళ్లు చేస్తున్నారని, టికెట్లు లేకుండా అన్న చెప్పాడంటూ డబ్బులు సంపాదనకు తెరతీశారన్నారు. రూ. 30 లక్షల డిపాజిట్లు ఉన్న మహానంది ఆలయానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అవినీతిని అరికట్టి రూ. 30 కోట్లు డిపాజిట్లు అయ్యేలా కష్టపడ్డామన్నారు. అవినీతికి పాల్పడిన వారిని సస్పెన్షన్ చేశామన్నారు. ఇప్పుడు టీడీపీ ప్రభుత్వంలో అధికారపార్టీ నేతలు మహానందీశ్వరుడి మీద గ్లాస్ నీళ్లు పోస్తే రూ. 100 తీసుకుంటూ దోచేస్తున్నారని దుయ్యబట్టారు. కేసులకు ఏ మాత్రం భయపడొద్దని, స్థానిక సంస్థల్లో మన సత్తా చాటుదామని ప్రజలకు శిల్పా చక్రపాణిరెడ్డి పిలుపునిచ్చారు. గాజులపల్లెలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ. 6.21 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేశామన్నారు.

క్లుప్తంగా

శాస్త్రోక్తంగా సహస్రదీపార్చన


సహస్రదీపాలను వెలిగిస్తున్న ఆలయాధికారులు

శ్రీశైలంటెంపుల్: జ్యోతిర్లింగక్షేత్రమైన శ్రీశైలమహాక్షేత్రమైన శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం సహస్ర దీపార్చన సేవ నిర్వహించారు. ముందుగా దేవాలయ ప్రాంగణంలోని పురాతన మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు వేద మంత్రోచ్ఛరణలతో సహస్రదీపార్చన పూజలు చేపట్టారు. ఈ సేవలో భాగంగా మండపంలో వెయ్యి దీపాలను వెలిగించి, ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను వెండిరథం పై ఉంచి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పాములపాడు: కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారిపై పాములపాడు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. రుద్రవరం గ్రామానికి చెందిన చిలుక రాజు సోమవారం బైక్‌పై నందికొట్కూరు వైపు బయలుదేరాడు. ముందు వెళ్తున్న శ్రీశైలం నుంచి కర్ణాటకకు వెళ్తున్న తుఫాన్ వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో చిలుక రాజుకు తలకు తీవ్ర గాయమైంది. వెంటనే 108 వాహనంలో ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

బస్టాండ్‌లో సైకిల్ స్టాండ్ ఏర్పాటు చేయాలి


ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

నందికొట్కూరు: ఆర్టీసీ బస్టాండ్‌లో సైకిల్ స్టాండ్ ఏర్పాటు చేయాలని సీపీఐ ఎంఎల్ జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ధర్నా ఏర్పాటు చేశారు. ఈ మేరకు డిపో మేనేజర్ నాగరాజుకు సమస్యలతో కూడిన వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్టాండ్‌లో సైకిల్ స్టాండ్ లేక వాహనదారుల ఇబ్బందులు పడుతున్నారన్నారు. సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు బైకులను ఎక్కడ పెట్టాలనో అర్థంకాక ఇబ్బంది ఆందోళన చెందుతున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బీబీ లక్ష్మీదేవి, ముర్తుజాబీ, గాబ్రియేలు, సోమన్న, షేక్షావలి,తదితరులు పాల్గొన్నారు.

పంచమఠాలలో విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణార్థం శ్రీశైల క్షేత్ర పరిధిలో పంచమఠాలలో విశేషంగా అభిషేకం, పుష్పార్చనలు జరిపించారు. సోమవారం ఉదయం భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధరమఠాలలో పూజలు చేపట్టారు. ముందుగా అర్చకులు సంకల్పాన్ని పఠించారు. అనంతరం ఘంటామఠంలోని గణపతికి పూజలు చేసి అనంతరం అన్ని మఠాలలో సంప్రదాయబద్ధంగా అభిషేకాది అర్చనలను నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాస రావు, ఏఈవో హరిదాసు, ఉపప్రధానార్చకులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

చెంచు గిరిజన రైతుపై పెద్దపులి దాడి

ఆత్మకూరురూరల్: కొత్తపల్లె మండలం చదరం పెంట చెంచుగూడేనికి చెందిన అంకన్న అనే యువకుడిపై సోమవారం సాయంత్రం పెద్దపులి దాడి చేసింది. దీంతో అతని చేతిపై పులి గోర్లు గీసుకు పోవడంతో స్వల్పంగా గాయపడ్డాడు. నల్లమల అడవుల్లో లోతట్టు ప్రాంతంలో ఉన్న చదరం పెంట గూడెం వాసులు కొంత కాలంగా అక్కడ నివాసాలు ఖాళీ చేసి అడవి అంచుల్లో నూతనంగా ఏర్పాటు చేసుకున్న గూడెంలో ఉంటున్నారు.అయితే గూడెం వాసులకు పాత గూడెం వద్ద సుమారు 150 ఎకరాల వ్యవసాయ భూములున్నాయి. పంట కాలాల్లో చెంచులు తమ పొలాలకు వస్తూ పోతూ ఉంటారు. ఆ క్రమంలో గూడేనికి చెందిన అంకన్న, మరో యువకుడు కలసి తమ పొలం వద్దకు వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చే ముందు అంకన్న బహిర్భూమికి చెట్ల చాటుకు వెళ్లాడు. అక్కడ కూర్చున్న అంకన్నపై పెద్దపులి హఠాత్తుగా పొదల్లోంచి అతనిపైకి దూకింది. దీంతో అంకన్న పెద్దగా కేకలు వేస్తు పొలం వైపు పరుగులు తీశాడు. కాని అప్పటికే పులి పంజా ఆయన చేతిని రాసుకుంటూ పోవడంతో స్వల్పంగా గాయాలయ్యాయి. వారు గట్టిగా కేకలు వేయడంతో పులి అక్కడ నుంచి వెళ్లి పోయింది. గాయం చిన్నదే కావడంతో గూడెంలోనే ఆకు పసురుతో వైద్యం చేసుకున్నట్లు తెలిసింది. అటవీ అధికారులకు సమాచారం అందడంతో వారు సంఘటనా స్థలానికి మంగళవారం ఉదయం వెళ్లి పులి అడుగు జాడలు పరిశీలించనున్నట్లు సమాచారం.

స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి


పటేల్ సెంటర్‌లో రాస్తారోకో చేస్తున్న దృశ్యం

నందికొట్కూరు: స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి నరసింహులు, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నాయకులు, కార్యాకర్తలు ఈ అంశంపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి అధికారంలోకి రావడానికి 176 హామీలు ఇచ్చిందన్నారు. చంద్రబాబు నాయుడు అధికారంలోకి రాగానే ప్రజలపై విద్యుత్ భారం మోపడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. పెట్రోల్, డీజిల్ ధరలు, నిత్యావసర ధరలు తగ్గిస్తానని ఎన్నికలలో హామీలిచ్చి మరిచిపోయారన్నారు. పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగులగొట్టాలని ఎన్నికల ప్రచారంలో పిలుపునిచ్చిన చంద్రబాబు ఇప్పుడు మీటర్లు బిగిస్తే కళ్లప్పగించి చూడటం సరికాదన్నారు. స్మార్ట్ మీటర్లతో ప్రజలు ఇబ్బందులు పడతారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మజీద్ మియా, గోపాల్, జునైద్‌బాషా, ఆది, ఎల్లనాయుడు, దేవన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం దిశగా అడుగులు వేయాలి


ఆకుకూరలు, కూరగాయల స్టాల్‌ను పరిశీలిస్తున్న ఏవో

వెలుగోడు: రైతులు ప్రకృతి వ్యవసాయం దిశగా అడుగులు వేయాలని మండల వ్యవసాయ అధికారిణి స్వాతి అన్నారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పండించిన ఆకు కూరలు, కూరగాయల స్టాల్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులందరూ సేంద్రియ ఎరువులు వాడి ప్రకృతి వ్యవసాయం చేసేలా వారిని చైతన్యవంతులను చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. వ్యవసాయశాఖ, అనుబంధ విభాగం ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో పాటు స్థానిక డ్వాక్రా మహిళలు, రైతుల భాగస్వామ్యంతో ఈ పథకం అమలయ్యేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని తెలిపారు. రైతులు రసాయనిక, పురుగు మందుల వాడకాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపాలని సూచించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

పగిడ్యాల: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి డాక్టర్ కృష్ణమూర్తి సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల కురుస్తున్న వర్షాలకు తాగునీరు కలుషితమయ్యే అవకాశం ఉందని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కలుషిత నీటి ప్రభావం వలన వాంతులు, విరేచనాలు ప్రబలి అతిసారం బారినపడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రాణాపాయం సంభవించే ప్రమాదం ఉందన్నారు. దోమల బెడద బారినపడకుండా ప్రతి ఒక్కరూ దోమ తెరలు వాడుకోవాలన్నారు.

24 నుంచి చౌడేశ్వరిదేవి జయంతి వేడుకలు

ఆత్మకూరు: పట్టణంలో వెలిసిన శ్రీచౌడేశ్వరిదేవి అమ్మవారి వార్షిక జయంతి వేడుకలు ఈనెల 24వ తేదీ నుంచి ప్రారంభమవుతున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. 24వ తేదీన ఆషాఢమాసం బహుళ అమావాస్య సందర్భంగా అమ్మవారికి క్షీరాభిషేకం, సహస్తనామ కుంకుమార్చన, దుర్గాహోమం, చౌడేశ్వరి యాగం, మధ్యాహ్నం మహామంగళహారతి, అన్నదాన కార్యక్రమంతో పాటు సాయంత్రం 4 గంటలకు అమ్మవారి బోనాల ఊరేగింపు, రాత్రి తొట్లోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 4న ధ్వజప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం ఉంటుందన్నారు.

అంబేద్కర్ భవన్ ఏర్పాటు చేయాలి

కొత్తపల్లి: నందికొట్కూరు నియోజకవర్గంలో ప్రతి మండలానికి ఒక అంబేద్కర్ భవన్ ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా నాయకులు ఎం.రమేష్ బాబు, కొత్తపల్లి మండల కార్యదర్శి వెంకట శివుడులు సోమవారం దుద్యాలలో మంత్రికి వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు విడుదల చేసి ఎస్సీ, ఎస్టీ రుణాలు తక్షణమే లబ్ధిదారులకు అందజేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మానవత్వం చాటిన సీఐ


బాధితులను ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్న సీఐ రాము, పోలీసు సిబ్బంది

ఆత్మకూరు: బాపనంతపురం గ్రామం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను సీఐ రాము ఆసుపత్రికి తరలించి మానవత్వం చాటారు. మంత్రి బాల వీరాంజనేయ స్వామి పర్యటన అనంతరం సీఐ ఆత్మకూరుకు వస్తుండగా మార్గమధ్యలో బాపనంతపురం గ్రామ సమీపంలో గేదెలు అడ్డుగా రావడంతో బైకుపై ప్రయాణిస్తున్న యువకులు కింద పడి గాయపడ్డారు. వడ్లరామాపురం గ్రామానికి చెందిన సురేష్, నాగరాజు, వెంకటేశ్వర్లు వెలుగోడు రిజర్వాయర్‌ను చూసి స్వగ్రామానికి వస్తుండగా ప్రమాదానికి గురయ్యారు. సీఐ గమనించి వాహనాన్ని నిలిపి పోలీసు సిబ్బంది సహకారంతో వారిని ఆసుపత్రికి తరలించారు. సత్వరమే స్పందించి మానవత్వం చాటుకున్న ఆత్మకూరు సీఐ రాము, కానిస్టేబుల్ సాగర్‌ను గ్రామస్తులు అభినందించారు. గాయపడిన వారికి ఎలాంటి ప్రాణాపాయం లేదని పోలీసులు తెలిపారు.

వర్షం కోసం పూజలు, ప్రార్థనలు


పూజలకు తరలి వెళ్తున్న గ్రామస్తులు

పాములపాడు: వర్షం కోసం సోమవారం బానుముక్కల గ్రామంలో ప్రజలు పూజలు, ప్రార్థనలు చేశారు. ఖరీఫ్‌లో తొలుత వేసిన విత్తు చాలా చోట్ల సరిగ్గా మొలకెత్తలేదు.మొలకెత్తిన పైర్లు వాడిపోయాయి. మళ్లీ విత్తనం వేసినా వానలు లేవు. వ్యవసాయ బావులు, బోర్లలో నీటి ఊటలు పెరగలేదు. దీంతో ప్రజలు మతాలకు అతీతంగా పూజలు, ప్రార్థనలు చేశారు. అందరూ కలసి గ్రామ శివారులో వనభోజనాలు చేశారు.

అంగన్‌వాడీలపై యాప్‌ల భారం తగదు


ఆత్మకూరు ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ వర్కర్లు

ఆత్మకూరు/నందికొట్కూరు: అంగన్‌వాడీ వర్కర్లపై యాప్‌ల భారం తగదని సీఐటీయూ పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి మంజుల అన్నారు. ఈ మేరకు పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సోమవారం అంగన్‌వాడీ వర్కర్లు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల వద్ద సెల్ నెట్‌వర్క్‌లు సరిగా పని చేయకపోవడంతో సమయం వృథా అవుతుందన్నారు. బాలసంజీవని యాప్‌లో లబ్ధిదారులకు ఆహారం, ఓటీపీ ద్వారా అందించాలని నిబంధన ఉందన్నారు. అయితే యాప్ పనిచేయక పౌష్టికాహారం అందించలేకపోయామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు ప్రమీలమ్మ, లక్ష్మీదేవి, శ్యామలమ్మ, రామతులసమ్మ, కుమారి, నాగలక్ష్మి, నాగమణి పాల్గొన్నారు. అలాగే అదే అంశంపై నందికొట్కూరులో సీఐటీయూ పట్టణ నాయకులు గోపాల కృష్ణ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నాగేశ్వరరావు, వరలక్ష్మి, పద్మ, శైలజ, ప్రసన్న, సుబ్బమ్మ, సరస్వతి నాగలక్ష్మి పాల్గొన్నారు.

భూమి కోల్పోయాం.. పరిహారం అందించండి


తహసీల్దార్ సుభద్రమ్మకు సమస్యను వివరిస్తున్న రైతు తిమ్మయ్య

పాములపాడు: నేషనల్‌హైవే 340సీ నిర్మాణంలో 0.39 సెంట్ల భూమి కోల్పోయాం పరిహారం అందించి ఆదుకోవాలని తిమ్మయ్య అనే రైతు తహసీల్దార్ సుభద్రమ్మను కోరారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తల్లి బరిగెల దానమ్మకు చెందిన భూమి పాములపాడు రెవెన్యూ పరిధిలో యర్రగూడూరు గ్రామ పొలిమేరలో సర్వే నెంబరు 594/సీలో 0.39 సెంట్లు హైవే నిర్మాణంలో కోల్పోయిందన్నారు. ఈ భూమికి సంబంధించి నష్ట పరిహారం అందించాలని కోరారు. స్పందించిన తహసీల్దార్ సర్వేయర్‌తో కొలతలు వేయించి పరిశీలిస్తామని, భూమి కోల్పోయినట్లు తేలితే పరిహారం ఇప్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని వివరించారు.

వచ్చారు...వెళ్లారు

- 20 ఇళ్లకే పరిమితమైన 'తొలిఅడుగు'

కొత్తపల్లి: ఓ వైపు ప్రజల నుంచి నిలదీతలు, మరో వైపు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ముందుకు రాకపోవడంతో 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమం తూతూ మంత్రంగా సాగుతోంది. సోమవారం దుద్యాల గ్రామంలో జరిగిన కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా వీరాంజనేయ స్వామి, ఎమ్మెల్యే గిత్తా జయసూర్య పాల్గొన్నారు. కేవలం కార్యక్రమాన్ని 20 ఇళ్లకు మాత్రమే ఖరారు చేసి మంత్రి పర్యటనను ముగించారు. ఉదయం 11.45 గంటలకు ప్రారంభమై 1.15 గంటల వరకు మాత్రమే నిర్వహించారు. గ్రామం మొత్తం అపరిశుభ్రంగా, మురికి కూపంగా ఉండటంపై మంత్రి ఎక్కడ ఆగ్రహిస్తాడోనని కూటమి నాయకులు ఒకే ఒక వీధిని ఎంపిక చేసి తూతూ మంత్రంగా కార్యక్రమాన్ని ముగించారు. గ్రామంలో బెల్ట్‌షాపులు, మందుబాబుల ఆగడాలపై ఓ మహిళ మంత్రికి వివరిస్తుండగా పట్టించుకోలేదు. గ్రామంలోని పాఠశాలలో నీళ్లు నిలిచి విద్యార్థులు వెళ్లేందుకు వీలుగా లేదని, శివపురం పెద్దవాగుపై హై లెవెల్ బ్రిడ్జి నిర్మించి 8 గ్రామాలు, ఐదు గిరిజన గూడెల ప్రజలకు ఉన్న సమస్యను పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి స్వాములు వినతి పత్రం అందజేశారు.



నందికుంట వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు,దుద్యాల నందికుంట మొక్కజొన్న పొలాల్లో నిలిచిన నీరు

నీట మునిగిన పంటలు

కొత్తపల్లి: మండలంలో మూడురోజులుగా కురుస్తున్న వర్షాలతో మొక్కజొన్న, వరి ఇతర పంటలు నీట మునుగుతున్నాయి. మొన్నటిదాక వర్షంలేక పంటలు ఎండుతున్నాయని బాధపడ్డ రైతన్నలకు వర్షం రూపంలో మరో దెబ్బ తగిలింది. మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటపొలాల్లో నీరు నిలుస్తుంది. ఎక్కువరోజు నీరు నిలిస్తే పంటలు కుళ్లిపోతాయని రైతన్నలు వాపోతున్నారు. సోమవారం నందికుంట గ్రామం వద్ద ప్రధాన రహదారిపై నీరు నిలవడంతో నీటిలోనే వాహనాలు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారు జాము వరకు మండలంలో మోస్తరు వర్షం కురిసింది. దీంతో మండలంలో 68.2 మి.మీలుగా వర్షపాతం నమోదైందని రెవెన్యూ అధికారులు తెలిపారు.

24.6 మీ.మీ. వర్షపాతం నమోదు

పగిడ్యాల: మండలంలో 24.6 మీ.మీ వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ శివరాముడు తెలిపారు. మూడు రోజులుగా కురుస్తున్నా తుఫాన్ వర్షాలకు వర్షధార పంటలైన మొక్కజొన్న, పత్తి, కంది, సోయాబిన్ తదితర పంటలు ఊపిరిపోసుకోగా వాటికి మందులు వేయడంలో రైతాంగం నిమగ్నమయ్యారు. ఈ మూడు రోజుల్లో కురిసిన వర్షాలే అన్నదాతల ఆశలు చిగురించేలా చేశాయని రైతాంగం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మహానంది: మహానంది మండలంలో వర్షం దంచి కొట్టింది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు ఏకధాటిగా కుండపోత వర్షం కురిసింది. మండలంలో 68.2 మిమీ వర్షపాతం నమోదైంది. ఇదిలా ఉండగా తిమ్మాపురం, బుక్కాపురం, గాజులపల్లె తదితర గ్రామాల పరిధిలో వాన నీరు పంటల పొలాలను ముంచెత్తాయి.

విజయవంతం చేయండి

బండి ఆత్మకూరు: కడమల కాలువ, బండి ఆత్మకూరు గ్రామాల్లో సోమవారం శ్రీశైలం మాజీ శాసనసభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి ఆధ్వర్యంలో 'బాబూ ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బారెడ్డి విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

ఆత్మకూరు: మున్సిపల్ అధికారులు పట్టణంలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపట్టి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని సీపీఎం పట్టణ కార్యదర్శి రణధీర్, రామ్‌నాయక్, సురేంద్ర కోరారు. పట్టణంలోని సుదర్శనవర్మ భవనంలో సోమవారం వారు మాట్లాడుతూ.. పట్టణంలోని 24 వార్డుల్లో పారిశుద్ధ్య లోపించి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. డ్రైనేజీల్లో పూడిక తీయకపోవడంతో మురుగు నీరు రోడ్లపైకి చేరుతుందన్నారు. దోమలు పెరిగి ప్రజలు జ్వరాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు.

తల్లికి వందనం.. ఇంకా దూరం!

- అధికారుల నిర్లక్ష్యంతో అర్హులకు దూరమవుతున్న పథకం
- వ్యవసాయ కూలీకి పదెకరాల భూమి, కారు ఉన్నట్లు చూపిన వైనం
- మరో చోట ఇతర వ్యక్తి అకౌంట్‌లో నిధులు జమ

పాములపాడు: ఇంట్లో ఎంత మంది విద్యార్థులు అంత మందికి తల్లికి వందనం కింద రూ. 15 వేలు ఇస్తామని కూటమి పాలకులు ఎన్నికల ముందు చెప్పారు. అధికారంలోకి వచ్చిన తర్వాత పాఠశాలలు తెరిచిన రోజే విద్యార్థి తల్లి అకౌంట్‌లో తల్లికి వందనం డబ్బులు జమ చేస్తామన్నారు. అదిగో.. ఇదిగోమంటూ కూటమి ప్రభుత్వం ఇటీవల రూ. 13 వేలు చొప్పున నిధులు జమ చేసింది. అయితే అర్హత ఉండి పథకానికి ఎంపిక కాకపోతే మళ్లీ దరఖాస్తు చేసుకోమని సూచించింది. అలాంటి వారు చాలా మంది అధికారుల చుట్టూ తిరిగి మళ్లీ దరఖాస్తు చేసుకున్నారు. అయినా ఇప్పటికీ పాంతన కారణాలు చూపుతూ పథకానికి దూరం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికీ చాలా మంది బాధితులు తమకు న్యాయం చేయాలంటూ అధికారులను ఆశ్రయిస్తున్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మండలంలోని కోల్స్ ఆనందాపురం గ్రామానికి చెందిన ఇద్దరు తమ పిల్లలకు తల్లికి వందనం డబ్బులు పడలేదని ఫిర్యాదు చేశారు. విచారణ చేసి తమకు న్యాయం చేయాలని దరఖాస్తు అందజేశారు.


ఎంపీడీఓకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

నాకు కారు, 10 ఎకరాల భూమి ఉందట

మాకు ముగ్గురు సంతానం. పెద్దమ్మాయి హరినానంద 8వ తరగతి, చిన్న కూతురు సుస్మితాప్రియ 7 వతరగతి పాములపాడు ఏఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుచున్నారు. మా అబ్బాయి రిషానందమహారాజ్ మా గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలలో 4వ తరగతి చదువుచున్నాడు. నాకు సెంటు భూమి కూడా లేదు. వ్యవసాయ కూలీ పనులకు వెళితేనే పూటగడుస్తుంది. అలాంటి నాకు 10 ఎకరాల పొలం, కారుతో విలాసవంతమైన జీవితం గడుపుతున్న తల్లికి వందనం జాబితాలో చూపడం ఆశ్చర్యం కలిగిస్తుంది. విచిత్రమేమిటంటే ఇద్దరు పిల్లలకు తల్లికి వందనం డబ్బులు పడ్డాయి. అబ్బాయి విషయంలో దరఖాస్తు స్థితి అర్హత లేదు అని ఆన్‌లైన్‌లో చూపించడం అన్యాయం. పట్టణ ఆస్తి 1000 చదరపు అడుగులకు సమానం, పొడి భూమి 10 ఎకరాలకు సమానం/ విద్యుత్ సగటు వినియోగం 300 యూనిట్లకు పైగా/ నాలుగు చక్రాల వాహనం/ కుటుంబ సభ్యుడు ప్రభుత్వ ఉద్యోగి, రూ.10,000 కంటే ఎక్కువ జీతం పొందుతున్న వ్యక్తి అని కనబరిచారు. కనీసం వాటినైనా ఇప్పించి న్యాయం చేయండి. – కాటిపోగు ప్రశాంత్‌బాబు, కోల్స్‌ఆనందాపురం

వేరే వ్యక్తి అకౌంట్లో ఎలా జమ అవుతాయి

నాకు ఇద్దరు పిల్లలు. శ్రీ కావ్య 4వ తరగతి, శ్రీమంతుడు 9వ తరగతి చదువుచున్నారు. అమ్మాయికి సంబంధించి నా భార్య జ్యోతి అకౌంట్‌లో డబ్బులు జమ అయ్యాయి. అబ్బాయికి సంబంధించిన డబ్బులు యర్రగూడరు గ్రామ పంచాయతీ మజారా గ్రామం శాంతినిలయం గ్రామానికి చెందిన కొడిగండ్ల వరప్రసాద్ బ్యాంకు ఖాతాలో జమ అయ్యాయి. ఇదెక్కడి విచిత్రం. జమ అయితే నా అకౌంట్‌లో జమ కావాలి. వేరొక వ్యక్తి బ్యాంకు ఖాతాలో ఎలా జమ అయ్యాయి. వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి సీఎం గా ఉన్నప్పుడు ఇలాంటి పొరపాట్లు జరగలేదే. ఇప్పుడెందుకు ఇలా జరిగాయి.

–కాటిపోగు కరుణాకర్, కోల్స్ ఆనందాపురం